ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే సెప్టెంబర్ 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీఆర్ఆర్‌సీడీఈ పీజీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) పరిధిలోని పీజీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల 12 నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్‌కాం, ఎమ్మెస్సీ, ఎమ్‌కాం (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించారు. కాగా పలు కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. తిరిగి వచ్చే నెల 19 నుంచి పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

● కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఆగస్టు 28: ప్రభుత్వం నుంచి పేదలకు అందే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బేగంపేట్ డివిజన్‌కు చెందిన 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను బుధవారం మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆడపడుచు పెండ్లి ఆర్థికంగా ఎంతో భారమని అన్నారు. ఆ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

గీతా సారాన్ని పాటించాలి


సీతాఫల్‌మండిలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఆగస్టు 28: సీతాఫల్ మండి త్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ మంగళవారం రాత్రి పాల్గొన్నారు. శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. సమాజంలోని ప్రతిఒక్కరు శ్రీకృష్ణుని మార్గాన్ని అవలంభించాలని, భగవత్ గీతా సారాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. నిర్వాహక సంఘం అధ్యక్షుడు బొగ్గుల కృష్ణ, నేతలు సాయినాథ్, కృష్ణ, అశ్విన్‌కుమార్, చెన్నయ్య, బాలాజి, మురళి తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లిలో కంటోన్మెంట్ యాదవ సంఘం అధ్యక్షుడు సి.సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో పాటు పలువురు ప్రముఖులు హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌యాదవ్ పలువురిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి డప్పు కళాకారుల ఆట, పాటలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. - మారేడ్‌పల్లి



టాపర్ అవార్డు ప్రదానం

గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలో జరిగిన 29వ వార్షిక సాంస్కృతిక సమ్మేళనంతో పాటు ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేడుకలకు అతిథులుగా విచ్చేసిన డీఈవో రోహిణి, సైబర్ క్రైమ్స్ ఏసీపీ ఎన్‌బీ రత్నం, టీఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు చేతుల మీదుగా 10/10 జీపీఏ సాధించిన ఎస్ఆర్‌నగర్ శ్రీనిధి గౌతమ్ విద్యాలయ విద్యార్థిని రాఖీపాల్ టాపర్ అవార్డును అందుకున్నారు. రాఖీపాల్ అవార్డు అందుకోవడం పట్ల శ్రీనిధి గౌతమ్ విద్యాలయ డైరెక్టర్లు కొల్లి లక్ష్మణరావు, ఎ.సుకుమార్ ఆనందం వ్యక్తం చేశారు. - అమీర్‌పేట్

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని బాపూజీనగర్ ముత్యాలమ్మ దేవాలయ గడప ముఖ ద్వార పూజలు బుధవారం ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు దుర్గయ్య, రామారావు, శ్రీకాంత్, అజిత్, కొమురయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. - బొల్లారం

ఆరోగ్యకరమైన అలవాట్లు ప్రోత్సహించాలి

నెస్లే ఇండియా డైరెక్టర్ సంజయ్ ఖజురియా

ఆహార అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

బొల్లారం, ఆగస్టు 28: ఆరోగ్యకరమైన జీవన శైలి, సమతుల్య ఆహారం, శారీరక శ్రమ యొక్క ప్రాముఖ్యతతో పాటు అరోగ్యకమైన అలవాట్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా నెస్లే ఇండియా సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ కార్పోరేట్ అఫైర్స్ అండ్ సస్టైనబిలిటీ డైరెక్టర్ సంజయ్ ఖజురియా అన్నారు. బుధవారం కంటోన్మెంట్ బొల్లారం రిసాలబజార్ ప్రభుత్వ బాలుర (జీబీహెచ్)పాఠశాలలో నెస్లే హెల్త్ కిడ్స్ 10వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న పిల్లలకు సమతుల్య ఆహారం, చురుకైన జీవన శైలి గూర్చి అవగాహన కల్పించడంతో పాటు పోషకాహార పదార్థాలను సంస్థ అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

డిప్యూటీ మేయర్‌కు మొక్కను అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: నూతనంగా జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు నగర డిప్యూటీ మేయర్ శ్రీలతను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన శ్రీనివాసరావు డిప్యూటీ మేయర్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజలు నిబంధనలు పాటించి, నిర్మాణాలు చేసేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంబీఎఫ్ చెక్కు అందజేత

మారేడ్‌పల్లి, ఆగస్టు 28: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడిగా ఉండి మృతి చెందిన శేఖర్ కుటుంబ సభ్యులకు మ్యూచివల్ బెనిఫిట్ ఫండ్ (ఎంబీఎఫ్) చెక్కును బుధవారం సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి సికింద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో అందజేశారు. జనరల్, స్పెషల్ లోన్ దాదాపు రూ.7 లక్షలు మాఫీ చేస్తూ రూ. 3,85,975 చెక్కును శేఖర్ భార్య నిర్మలబాయికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామ్మోహన్, డైరెక్టర్ కిష్టయ్య, కుమార్, రమేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

తుకారాంగేట్‌లో యువతకు అవగాహనను కల్పిస్తున్న టెక్ మహీంద్ర ఫౌండేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట, ఆగస్టు 28: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలను కల్పించేందుకు అప్సా-టెక్ మహీంద్ర ఫౌండేషన్ కృషి చేస్తుందని సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం అన్నారు. బుధవారం తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద అప్సా-టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణను అందించేందుకు దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం పురుషోత్తం మాట్లాడుతూ నిరుద్యోగులకు మెడికల్ కోడింగ్‌లో శిక్షణతో పాటు ఉపాధిని కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు ఇచ్చే శిక్షణలో 20-28 ఏండ్ల యువత అర్హులని అన్నారు. ఇందులో మెడికల్ టర్మినాలజీ, ఎంఎస్ ఆఫీస్, కమ్యూనికేషన్ హ్యూమన్ అనాటమి, ఆర్సీఎం, ఫిజియాలజీ, బేసిక్ బిల్లింగ్ టర్మినాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిలో శిక్షణ అందించనున్నట్లు తెలియజేశారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకాం, ఎమ్‌కాం విభాగాల్లో ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 91549 90132, 91549 90130లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెబిలైజేషన్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నూతన సైన్ బోర్డుల ఏర్పాటు

రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ప్రాణాంతకమైన ప్రమాదాల దృష్ట్యా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశంలో నూతన సైన్ బోర్డులను ఏర్పాటు చేయించారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని గుర్తించిన ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు జీహెచ్ఎంసీ అధికారులతో సంప్రదించి ఆలుగడ్డబాయి ప్రాంతంలో మెట్రో పిల్లర్ నంబర్ 1125 సమీపంలో యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా సైన్ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పిల్లర్ నంబర్ 1135 వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. అధికారులకు సీఐ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అట్టడుగువర్గాలకు అవకాశాలు కల్పిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న మైండ్‌స్పేస్ సీఈవో శ్రవన్‌కుమార్

బేగంపేట్, ఆగస్టు 28: అట్టడుగు వర్గాలకు అవకాశాలు కల్పించేందుకు మైండ్‌స్పేస్ ఆర్ఈఐటీ కృషి చేస్తుందని సంస్థ సీఈవో శ్రవన్‌కుమార్ గోనే తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ ఎస్డీరోడ్డు మినర్వా కాంప్లెక్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకుడు మయూర్ పట్నాతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ్ ద్వారా తమ సంస్థ ఆర్థికంగా వెనకబడిన యువతలో నైపుణ్యాలు పెంపొందించి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. వివిధ రంగాల్లో నైపుణ్యాలు నేర్పించడంతో పాటు ఉపాధి కల్పిస్తున్నట్టు వెల్లడించారు. నిరుద్యోగులకు మూడు నెలల పాటు ఎలక్ట్రీషియన్, సోలార్‌టీవీ ఇన్‌స్టాలేషన్, జావా డెవలప్‌మెంట్, డేటా అనాలసిస్, మహిళలకు బ్యూటిషీయన్, టైలరింగ్, ఫుడ్ బేవరేజ్, రిటైల్, ఐటీ నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. సికింద్రాబాద్, ఈసీఐఎల్, చందానగర్, సురారం కేంద్రాల్లో యువతతో పాటు మహిళలను ఆర్థికంగా నిలబెట్టేందుకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు వివరించారు. సీఎస్ఆర్ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా 120 మందికి శిక్షణ పూర్తి అయినట్టు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది యువతకు శిక్షణ ఉపాధి కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకొని ఉపాధి పొందుతున్న పలువురు యువత తమ అనుభవాలను పంచుకున్నారు.

చెరువుల ఆక్రమణపై డిప్యూటీ మేయర్ సమీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: చెరువుల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమైన ఆమె పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల ఆక్రమణ, నాలాలపై అక్రమ నిర్మాణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వరదనీరు అక్రమదారుల దుశ్చర్య వల్ల చెరువుల్లో చేరకుండా రోడ్లపై ప్రవహిస్తుండడంతో పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలాలు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన వారి గురించి హైడ్రాకు సమాచారం అందించి, వారికి సహకరించాలని ఆదేశించారు. చెరువులకు సంబంధించిన లేఅవుట్‌ను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేసి సర్వే నిర్వహించి, చెరువులను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు, టీపీఎస్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

ఓయూ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ జహంగీర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నూతన హెడ్‌గా ప్రొఫెసర్ వై.జహంగీర్ నియమితులయ్యారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం ఓయూ గెస్ట్‌హౌజ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాములు, మాజీ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ స్మిత సంబ్రాని, ప్రొఫెసర్ సుధ, డాక్టర్ విద్యాసాగర్ రావు, డాక్టర్ సమున్నత, పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లు వి.శేఖర్, హనుమంతరావు, కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్లు చెన్నప్ప, ప్యాట్రిక్, కవితాదేవి, రంజని, డాక్టర్ జి. శ్రీనివాసరావు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జహంగీర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

తిరుమలగిరిలోని స్వయంభు వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మురళీముదిరాజ్, వీరేశం, చుక్కారపు రమేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. - బొల్లారం

ప్రొఫెసర్ యాదవరెడ్డి కన్నుమూత

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: స్వాతంత్ర్య సమరయోధుడు, ఓయూ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.యాదవరెడ్డి (94) మృతి చెందారు. పాత నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన ఆయన 1930లో జన్మించారు. నిజాం సంస్థానాన్ని దేశంలో విలీనం చేయాలని జరిగిన పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. ఉన్నత చదువులు చదివిన అనంతరం ఓయూ ఎకానమిక్స్ విభాగంలో అధ్యాపకుడిగా చేరారు. విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 1986లో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించి, రెండేళ్ల పాటు సేవలందించారు. 1988లో ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా బాధ్యతలు చేపట్టి, రెండేళ్ల పాటు పనిచేశారు. 1990లో పదవీ విరమణ చేసిన ఆయన హబ్సిగూడలో స్ట్రీట్ నంబర్ 7లో స్థిరపడ్డారు. ఆయన భార్య 2019లో పరమపదించారు. ఆయనకు ఇద్దరు కుమారులు. ఆయన అంతిమయాత్ర హబ్సిగూడలోని స్వగృహం నుంచి గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని కుమారులు తెలిపారు. అంత్యక్రియలను బేగంపేటలోని మహాపరినిర్వాణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన మృతి పట్ల పలువురు అధికారులు, అధ్యాపకులు నివాళులర్పించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: విద్యార్థినులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి, జాగ్రత్త వహించాలని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సూచించారు. తార్నాక డివిజన్ లాలాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్లూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా రుతుస్రావం పరిశుభ్రత అంశంపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 360 శానిటరీ ప్యాడ్లను అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రుతుస్రావం ఆలస్యమైతే తల్లిదండ్రులు, వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లూ ఫౌండేషన్, యాక్షన్ ఎయిడ్, ఎంఎంఎఫ్ తదితర సంస్థల ప్రతినిధులు పార్వతి, సుమతి, నీలిమ, అనురాధ, వందన, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మెడ, నడుము నొప్పులను నివారించవచ్చు

అమీర్‌పేట్, ఆగస్టు 28: నడుము, మెడ సమస్యలకు శస్త్రచికిత్సలు మాత్రమే సమాధానం కాదని, తగిన నివారణ వ్యూహాలను అనుసరిస్తే శస్త్రచికిత్సలు లేకుండానే నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చని ప్రముఖ క్రీడా వైద్య నిపుణులు డాక్టర్ భక్తియార్ ఎస్.చౌదరి అన్నారు. విటమిన్ 'డి' లోపాల వల్ల తలెత్తే నడుము, మెడ వంటి సమస్యలతో విద్యార్థులు, గృహిణులు, సాయుధ దళాల సిబ్బంది శస్త్రచికిత్సలకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని దాదాపు 10 వేల మందికి పైగా అవగాహన కల్పిస్తూ సంప్రదాయ వైద్య విధానాల ద్వారా నయం చేసినట్టు తెలిపారు. బుధవారం అమీర్‌పేట్‌లోని హోటల్ గ్రీన్ పార్క్‌లో జరిగిన సమావేశంలో భక్తియార్ పలు అంశాలపై వివరంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రముఖ ఇంటీరియర్ డిజైనర్ శాంతి వాసిరెడ్డి పలు అంశాలపై మాట్లాడారు. ఐఏఓహెచ్ మాజీ అధ్యక్షుడు విజయారావు తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన సందర్శించిన కార్పొరేటర్

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 28: పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో ఉన్న బస్తీ దవాఖానను బుధవారం బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత సందర్శించారు. పలువురు రోగులతో మాట్లాడారు. వైద్యం అందుతున్న తీరు, మందులు ఇస్తున్నారా? వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఫలితాలు సకాలంలో చేస్తున్నారా అని అడిగారు. డాక్టర్లు, సిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు అని తెలుసుకున్నారు. ఇటీవల డెంగీ, విష జ్వరాల తీవ్రత పెరిగిందని, అందుకే వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకోవడానికి వచ్చామని ఆమె తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మీపతి, ఎం.కుశాల్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

My client SRIPADA SANTOSH KUMAR, S/o. Sripada Pandurangam, R/o. H.No. 7-1-312, Maruthi Veedhi, Monda Market, Secunderabad entered into Agreement for purchase of H.No. 12-1-1549, admeasuring 80.00 Sq.yds., situated at Adarshnagar Colony, Shanthinagar, Secunderabad. 1. N.SUCHARITHA, W/o. N.RAMESH BABU Legal Heir and paid advance amount to them.

In case if anybody have any objection in respect of the said property, they may contact the undersigned with relevant documents within a period of One Week from the date of this publication, failing which my client will proceed for Registration of Sale Deed. Thereafter no claims be entertained.

Sd/- **(N.RAMESH BABU)**
Advocate
12-1-1549, Adarshnagar,
Shanthinagar, Secunderabad,
Cell No. 9247757549, 9133464655.